క్లుప్తంగా

మల్లేశ్వరునికి ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: గ్రామంలోని పార్వతీ మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు భైర వభట్ల సుబ్రహ్మణ్యేశ్వర శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి, బిల్వాలతో అర్చన చేశారు. అనంతరం స్వామివారిని పూలతో అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోరంగి సొసైటీ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు: కోరంగి సొసైటీ త్రీమెన్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. కోరంగి సొసైటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్‌గా కొప్పిశెట్టి శ్రీనాగ వీరభద్ర ఈశ్వరరావు(బాబి), సభ్యులుగా ఏచూరి సత్తి రామరాజు(జి.వేమవరం), వాసంశెట్టి గోవిందు(పటవల) ప్రమాణ స్వీకారం చేశారు.

ఎంపీడీఓ లక్ష్మణరావు బాధ్యతల స్వీకరణ


లక్ష్మణరావును అభినందిస్తున్న ఎంపీపీ తదితరులు

తాళ్లరేవు: మండల నూతన ఎంపీడీఓగా నియమితులైన బి.లక్ష్మణరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను ఎంపీపీ రాయుడు సునీత, డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాష్ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఎంపీడీఓను సత్కరించి అభినందించారు.

ఏరియా ఆస్పత్రిని సందర్శించిన ఎమ్మెల్యే

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఆస్పత్రిని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు మంగళవారం సందర్శించారు. ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మితమవుతున్న మెడికల్ స్టోర్ భవనాన్ని పరిశీలించారు. పంచాయితీరాజ్ డీఈఈ రాజ్‌కుమార్‌తో దాని నిర్మాణంపై చర్చించారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరావుతో శస్త్ర చికిత్సలు, మందులు తదితర అంశాలపై మాట్లాడారు. అనంతరం అభివృద్ధి పనులపై చర్చించారు.

క్లోరిన్ గ్యాస్ ప్రభావంతో మహిళకు అస్వస్థత


యానాం జీజీహెచ్‌లో చికిత్సపొందుతున్న లోవలక్ష్మి

యానాం: నియోజకవర్గ పరిధిలో ఈనెల 9న కనకాలపేట రక్షిత మంచినీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో క్లోరిన్ గ్యాస్ లీకైన ఘటనకు సంబంధించి గ్రామంలో పలువురు అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. అయితే అందరూ కోలుకున్నప్పటికీ జాజుల లోవలక్ష్మి పరిస్థితి తీవ్రంగా మారడంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పీడబ్ల్యూడీ శాఖ అధికారులు ఈ ఘటనకు బాధ్యత వహించి బాధితులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాడపల్లి క్షేత్రంలో గ్రామోత్సవం

కొత్తపేట: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా సాగింది. వైష్ణవ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, వివిధ సేవలను కనుల వైకుంఠంగా నిర్వహించారు. భక్తులు కనులారా తిలకించి తన్మయత్వం చెందారు. అనంతరం కోలాహలంగా ఉట్లోత్సవం నిర్వహించారు.

రైస్‌మిల్లులో డీఎం విచారణ

పి.గన్నవరం: స్థానిక రైసుమిల్లు యజమానిని ఇటీవల ఒక వ్యక్తి బెదిరించి రూ.1.5 లక్షలు కాజేశాడని వచ్చిన ఆరోపణలపై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం విచారణ నిర్వహించారు. మిల్లు యజమాని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. తన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రైసుమిల్లులో బియ్యం నిల్వలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఎస్ఓ ఎండీ ఇస్మాయిల్, పూర్ణిమ ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు చర్యలు

జిల్లాలో ఖరీఫ్ పంటకు సంబంధించి రైతుల నుంచి 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శ్రీనివాసరావు విలేకరులకు తెలిపారు. జిల్లాలో 1,56,505 ఎకరాల్లో వరి పంట వేశారన్నారు. దీనికి సంబంధించి 4.38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారన్నారు. ఇంతవరకూ 75 శాతం ఈ-క్రాపు నమోదు కార్యక్రమం పూర్తయిందన్నారు.

దర్జాగా కబ్జా

- దుడ్డివారి అగ్రహారంలో ఆక్రమణలు
- రోడ్డు మధ్యలో స్తంభం ఏర్పాటు
- స్థానికుల ఆందోళన
- స్థలాన్ని పరిశీలించిన అధికారులు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో పలు చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నా పట్టణ ప్రణాళిక విభాగం సీరియస్‌గా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఆక్రమణలదారులు మాత్రం దర్జాగా కబ్జాలు చేస్తూనే ఉన్నారు. 2వ వార్డులోని తామర చెరువు పార్కు వద్ద, 28వ వార్డు దుడ్డివారి అగ్రహారం వద్ద మున్సిపల్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. దుడ్డివారి అగ్రహారం స్థానికులైతే రోడ్డు ఆక్రమణపై ఏకంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులకు సైతం ఫిర్యాదు అందించారు. అయినా ఆక్రమణదారుడి నుంచి ఆ స్థలం నాదేనన్న వాదన వినిపిస్తోంది. గ్రావెల్ రోడ్డు మధ్యలోనే ఆక్రమణదారుడు పిల్లర్ నిర్మిస్తుండంపై ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్ల కిందట నుంచి స్థానిక ప్రజలు రోడ్డుగా ఉపయోగించుకుంటున్నారు. 2003లో 12 అడుగుల రోడ్డు కోసం అక్కడి భూస్వాములు మున్సిపాలిటీకి రాసి ఇచ్చారు. ఈ మేరకు కౌన్సిల్ తీర్మానం కూడా అయింది. ఇప్పటికే మున్సిపాలిటీలో నాలుగు సార్లు గ్రావెల్ రోడ్డుగా అభివృద్ధి చేసింది. ఆక్రమణదారుడు ఇప్పుడు ఆ రోడ్డుకు మధ్యలో పిల్లరు వేయడంతో వివాదం మొదలైంది. ఈ స్థలం నాదేనిని ఆ ఆసామి చెబుతున్నారు. ఈ ఆక్రమణ సంగతి తేల్చుకుందామని దుడ్డి వారి అగ్రహారం ప్రజలు ఈ విషయంపై మంగళవారం ఉదయం నుంచి అక్కడే తిష్టవేశారు. మున్సిపల్ అధికారులు వస్తేనే గాని తాము ఇక్కడ నుంచి కదిలేది లేదని భీష్మించారు.

విచారణ చేయిస్తున్నాం

ఆ ఆక్రమణపై పట్టణ ప్రణాళిక అధికారి రాణి సంయుక్తను సాక్షి వివరణ కోరగా ఆ ఆక్రమణపై విచారిస్తున్నామని చెప్పారు. అయితే పిల్లర్ నిర్మించిన వ్యక్తి తనకు దస్తావేజులు ఉన్నాయని చెబుతున్నారు గాని, చూపించడం లేదని చెప్పారు.

మున్సిపల్ పార్కు వద్ద గేటు స్థలం ఆక్రమణ

స్థానిక 2వ వార్డులోని మున్సిపల్ తామర పార్కునకు పడమర వైపు 10 అడుగుల వెడల్పుతో ఉంది. కొన్నేళ్ల కిందట మున్సిపాలిటీ నిర్వహించిన సర్వేలో సరిహద్దులు నిర్ణయించి 10 అడుగుల గేటు నిర్మించింది. ఇప్పుడు ఓ ఆక్రమణదారుడు ఆ 10 అడుగుల గేటును 6 అడుగులకు కుదించి మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించుకుంటున్నాడు. గేటును కుదిస్తూ గోడను నిర్మిస్తున్నాడు. కొందరి టీడీపీ నాయకుల అండతోనే ఈ ఆక్రమణ జరుగుతున్నట్టు తెలిసింది.


28వ వార్డు దుడ్డివారి అగ్రహారంలో రోడ్డు మధ్యలో నిర్మించిన పిల్లర్ వద్ద ఉన్న స్థానికులు

అధికారులతో విచారణ చేయిస్తాం

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్‌ను సాక్షి వివరణ కోరగా ఈ ఆక్రమణ విషయం తన దృష్టికి రాలేదని, అయినప్పటికీ పట్టణ ప్రణాళిక అధికారులను అక్కడికి పంపించి విచారణ చేయిస్తానన్నారు.

రోడ్డును పరిశీలించిన అధికారులు

స్థానిక దుడ్డివారి అగ్రహారంలో రోడ్డును ఆక్రమించి పిల్లర్ నిర్మించిన ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్, పట్టణ ప్రణాళిక అధికారి రాణి సంయుక్త మంగళవారం సాయంత్రం సందర్శించి పరిశీలించారు. ఈ వివాదంపై ఇరు పక్షాలతో వారు చర్చించారు. దీనిపై మళ్లీ సర్వే చేయిస్తామని దుడ్డివారి అగ్రహారం ప్రజలకు స్పష్టం చేశారు. దీంతో మున్సిపల్ అధికారులు వచ్చి పరిశీలించాలన్న దుడ్డివారి అగ్రహారం ప్రజలు భీష్మించిన క్రమంలో కమిషనర్ రావడంతో అక్కడ నుంచి వెళ్లారు.


2వ వార్డు తామర చెరువు పార్కు గేట వద్ద ఆక్రమణ దృశ్యం

బొత్సను కలిసిన యువజన విభాగం నాయకులు


బొత్సను కలిసిన యువజ విభాగం నాయకులు

అమలాపురం రూరల్: శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు, ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణను రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్, విద్యార్థి విభాగం ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్ విశాఖపట్నంలో ఆయన నివాసంలో కలిశారు. బొత్సను మర్యాద పూర్వకంగా కలిసి వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టే కార్యక్రమాలపై బొత్స సూచనలు తీసుకున్నారు. అదే విధంగా జిల్లాల్లో పార్టీకి పటిష్టతకు కృషి చేయాలని బొత్స కోరినట్లు వారు తెలిపారు.

వరద తాకిడి

ఐ.పోలవరం: ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలలోని గోదావరి పరివాహక ప్రాంతాలకు మరోసారి వరద తాకిడి తగిలింది. ఎగువ నుంచి వచ్చే జలాలు విడుదల కారణంగా గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ నదీపాయల్లో వరద పెరుగుతోంది. ఈ వరదకు ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన, అల్లవరం మండలాల్లోని పలు లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈసారి పెద్దగా వరద వచ్చే అవకాశం లేదని, లోతట్టు గ్రామాలు ముంపుబారిన పడేంత రాదని అధికారులు చెబుతున్నారు. అయితే ఇటీవల వచ్చిన వరదలకు లోతట్టు ప్రాంతాల్లో ఇంకా ముంపు కొనసాగుతూనే ఉంది. ఇది నెమ్మదిగా తగ్గుతున్న సమయంలో మరోసారి వరద మొదలైంది. వరదల వల్ల సామాన్యుల ఇబ్బందులతోపాటు పెద్ద ఎత్తున కూరగాయ, బొప్పాయి, అరటి వంటి పంటలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. వరద పూర్తిగా తగ్గిందని ఉద్దేశంతో లంక గ్రామాల్లో సాగుకు రైతులు సిద్ధమవుతున్న తరుణంలో వరద రావడం వారిని కలవరానికి గురి చేస్తోంది.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధుల దూరం


ఇమ్మిడివరప్పాడులోతడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీపీవో శాంతలక్ష్మి

అమలాపురం రూరల్: చుట్టూ ఉన్న పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతలక్ష్మి సూచించారు. మండలంలో ఇమ్మిడివరప్పాడు గ్రామంలో మంగళవారం ఉదయం ఆమె పర్యటించారు. సర్పంచ్ రేలంగి దుర్గారావు ఆధ్వర్యంలో తడి చెత్త, పొడి చెత్త సేకరించడంపై తనిఖీ చేశారు. పంచాయతీ క్లాస్ మిత్రాలకు తడి, పొడి చెత్తను వేరువేరుగా ఇవ్వాలని ప్రజలను కోరారు. అనంతరం స్థానికులకు అవగాహన కల్పించారు.

నేటి నుంచి స్వస్త్ నారీ-సశక్త్ పరివార్ వైద్యసేవలు

యానాం: మహిళలు ఆరోగ్యవంతులుగా తయారు కావాలనే లక్ష్యంతో బుధవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకూ స్థానిక జిప్‌మెర్ ప్రభుత్వ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో స్వస్త్ నారి-సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్టు మంగళవారం ప్రధాన వైద్యాధికారి ఆనంద్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. జిప్‌మెర్ వైద్యబృందం యానాంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పర్యటించి అక్కడ టీచర్స్‌కు, మహిళా పోలీసులకు, మున్సిపల్ వర్కర్స్ కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్వస్త్ నారీ స్వశక్త్ పరివార్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని బుధవారం నియోజకవర్గ పరిధిలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ ప్రకటనలో తెలిపారు. 17న గిరియాంపేట, 22న దరియాలతిప్ప, 23న పరంపేట, 24న మెట్టకూరు, 25న కనకాలపేట, అక్టోబర్ ఒకటిన సావిత్రినగర్ ఉప ఆరోగ్య కేంద్రాల వద్ద ఈ హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన కేసులో జైలు

అమలాపురం రూరల్: హైకోర్టు ఆదేశాలను ధిక్కరించిన కేసులో గున్నేపల్లి అగ్రహారం పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానికి వారం రోజులు జైలు శిక్ష విధించారు. ఆ శిక్షను రెండు రోజుల పాటు సస్పెండ్‌చేసి ఈ నెల 17న కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గున్నేపల్లి అగ్రహారం గ్రామానికి చెందిన ముత్తాబత్తుల సత్యనారాయణ తన ఇంటి ఎదురుగా రాజకీయం చేసి మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపడుతున్నారంటూ ఈ ఏడాది జనవరిలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై న్యాయవాది మాకిరెడ్డి మనోజ్ హైకోర్టులో రిట్ పిటీషన్ దాఖలు చేశారు. రిట్‌పై టి.రాజశేఖర్ అన్ని అంశాలను పరిశీలించి ఆ ప్రాంతంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అయితే హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులను ధిక్కరించి అదే ప్రాంతంలో మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేపట్టి పూర్తి చేశారు. ఈ నెల 15న కోర్టు ఉత్తర్వుల దిక్కరణపై న్యాయవాది మనోజ్ పిటీషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయవాది వాదనలతో ఏకీభవించింది. పంచాయతీ కార్యదర్శి దుర్గాభవానినీ వారం రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించింది. జైలు శిక్షను రెండు రోజుల పాటు నిలుపుదల చేసి ఈ నెల 17న కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది.


గున్నేపల్లి అగ్రహారంలో నిర్మించిన మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకు

వాహన యజమానులు వివరాలను నమోదు చేయించుకోవాలి

అమలాపురం రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు వాహన యజమానులు వారి బ్యాంక్ అకౌంట్ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆయన కార్యాలయంలో లారీ యజమానులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో డీటీఓ మాట్లాడుతూ వివరాల నమోదులో వాహన యజమానులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, లారీ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు నల్లా రాంబాబు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ హరీష్ మాధుర్, ఎమ్మెల్యే సుబ్బరాజు తదితరులు

తాళ్లరేవు: క్రీడాకారులు విద్యార్థి దశ నుంచే క్రీడల్లో పాల్గొని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు అన్నారు. మంగళవారం తాళ్లరేవులోని శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఎంఈఓలు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ, హెచ్ఎం ప్రసాదరావు, స్టాఫ్ సెక్రటరీ వాకపల్లి అప్పారావు, ఫిజికల్ డైరెక్టర్ నాగేంద్ర, కూటమి నాయకులు టి.లక్ష్మణరావు, బాబ్జీరాజు, బూరిబాబు, వినోద్, బాబి, చక్రవర్తి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం

గ్రామ హైస్కూల్‌లో పలు అభివృద్ధి పనులను ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మంగళవారం ప్రారంభించారు. కెమిస్ట్రీ ల్యాబ్, లైబ్రరీహాల్, ప్లేఫీల్డ్, కిచెన్ గార్డెన్, రెయిన్ హార్వెస్టింగ్ పనులను వారు ప్రారంభించారు. హెచ్ఎం ప్రసాదరావు, స్టాఫ్ సెక్రటరీ వాకపల్లి అప్పారావు, బొంతు శ్రీను, మేడిశెట్టి సత్తిబాబు, వినోద్, చక్రవర్తి, బాబూరావు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్

ముమ్మిడివరం: ఓజోన్ పొర పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకర్ సూచించారు. అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురష్కరించుకొని మంగళవారం కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అతినీల లోహిత కిరణాల నుంచి భూమిని రక్షించే ఓజోన్ పొర ప్రాముఖ్యతను వివరించారు. చెట్లు నరికి వేత, మొక్కలు పెంపకం తగ్గడం, యంత్రాల నుంచి వచ్చే వినాశకర వాయువుల వలన ఓజోన్ పొరను ఇబ్బంది ఏర్పడుతుందని, దానిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐ.క్యూర్ ఏపీ కోఆర్డినేటర్ ఎన్.తులసిలక్ష్మి, అధ్యాపకులు డి.పల్లంరాజు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

124 పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

యానాం: వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పుదుచ్చేరిలో అదనంగా 124 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్నిల అధికారి, జిల్లా కలెక్టర్ కులొంగొత్తన్ తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో సమావేశంలో నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ బూత్‌ల సంఖ్య పెంచడానికి అభిప్రాయాల కోసం సమావేశం నిర్వహించినట్టు తెలిపారు. 1200 మంది ఓటర్ల కంటే ఎక్కువ మంది ఉన్న పోలింగ్ బూత్‌లను పునర్ వ్యవస్థీకరిస్తున్నామన్నారు. అవసరమైన చోట్ల పోలింగ్ కేంద్రాల పేర్లను మార్పుచేస్తామని, 36 పోలింగ్ బూత్‌లను వేరే చోటకు మారుస్తున్నట్టు తెలిపారు. దీనిపై ఆమోదం కోసం భారత ఎన్నికల సంఘానికి నివేదిక పంపుతున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

యానాం: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న యానాం పట్టణ ప్రాంతానికి చెందిన మహిళకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సీతారాముడు అనే వ్యక్తి తల్లి మంగళగిరిలో తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతుందని ఆమెను ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆ విషయం తెలిసి ఎమ్మెల్యే అశోక్ స్పందించి ఆయన సహాయకుడు రమేష్‌ను మంగళగిరి పంపి ఆమె చికిత్సకు కావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

రామకోటితో భద్రాదికి ప్రయాణం

- నాడు వితరణలు.. నేడు ఆధ్యాత్మిక సేవలు

అమలాపురం టౌన్: వారంతా 50 ఏళ్ల కిందట ఒకే పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు. ఒక్కటిగా ఉంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1974లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు. వారు చదువుకున్న పాఠశాలకు గతంలో సైకిల్ షెడ్డు నిర్మించారు. అమలాపురం శ్రీకామాక్షీ పీఠానికి ధన సహాయం చేశారు. అంధులకు, పేదలకు ఆహారం అందించారు. ఇప్పుడు ఆధ్యాత్మిక సేవలతో తరించాలనుకున్నారు. ఆరు పదుల వయసు ఉన్న పూర్వపు విద్యార్థులు శ్రీరామ కోటి రాశారు. ఈ రామ కోటిని పట్టుకుని భద్రాచలం శ్రీరామచంద్రమూర్తి సన్నిధికి ప్రత్యేక బస్సుల్లో మంగళవారం బయలుదేరారు. అమలాపురం బ్యాంక్ స్ట్రీట్ నుంచి 40 మంది భద్రాదికి పయనమయ్యారు. అలాగే వీరితో పాటు కడపలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 20 మంది కూడా రామ కోటితో అటు నుంచి బయలుదేరారని అమలాపురానికి చెందిన పూర్వపు విద్యార్థుల బృందం తెలిపారు. అందరూ కలిసి బుధవారం ఉదయం శ్రీరామ కోటి ప్రతులను భద్రాదిలో రాములోరి దేవస్థానంలో సమర్పిస్తామన్నారు. శిష్టా శ్రీహరి, చిక్కాల నాగేంద్ర, శివ, రాంగోపాల్, రామారావు, బాబూరావు, నారాయణరావు, రవీంద్రమూర్తి, లక్ష్మి, విజయ, డాక్టర్ శ్రీరామన్నారాయణరావు, డాక్టర్ వెంకట్ తదితరులు భద్రాదికి శ్రీరామ కోటి ప్రతులతో బయలుదేరి వెళ్లారు.



ప్రతులతో ప్రత్యేక బస్సులో బయలు దేరుతున్న పూర్వపు విద్యార్థులు

హేతువాద మానవ వాదాల హిమాద్రి పుస్తకావిష్కరణ

అమలాపురం రూరల్: 'హేతువాద మానవ వాదాల హిమాద్రి రావిపూడి వెంకటాద్రి' అనే పేరుతో ప్రముఖ రచయిత, హేతువాద తత్వవేత్త రావిపూడి వెంకటాద్రి జీవిత చరిత్ర పుస్తకాన్ని డాక్టర్ పుల్లపు వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘ సభ అమలాపురం ఎస్టీయూ భవన్‌లో మంగళవారం రాత్రి కాకిలేటి వీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రావిపూడి వెంకటాద్రి హేతువాదం, మానవ వాదం, భౌతిక వాదం, విశ్వతత్వం, జీవ పరిణామం వంటి అనేక అంశాలపై 80కి పైగా గ్రంథాలు రచించారు. వెంకటాద్రి ఈ రచనల ద్వారా ఆధునిక విజ్ఞాన తత్వసారాన్ని మానవ సమానత్వాన్ని స్వేచ్ఛ సౌభ్రాతృత్వాన్ని విలువలను తెలియజేసే సాహిత్యాన్ని నేటి తరాలకు అందించారు. ఈ పుస్తకానికి కడలి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కడలి సత్యనారాయణ ముద్రణ అందించారు. ఈ కార్యక్రమంలో వక్తులు పాల్గొని ప్రస్తుత సమాజంలో హేతువాద మానవ వాదాల అభ్యుదయ, శాస్త్రీయ భావాల అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి డి.రాజశేఖర్, ఆర్థిక కార్యదర్శి టి.బాలకృష్ణ, జనపల్లి భీమారావు, కుంచే సిద్ధార్థ ప్రసాద్, వంగా అయ్యప్ప కుమార్, నేరేడుమిల్లి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డి.ప్రకాష్, ఉపాధ్యాయిని విక్టోరియా రాణి పాల్గొన్నారు.

నాలుగోసారి మునిగిన కాజ్‌వే

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం గ్రామానికి సరిహద్దులో ఉన్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన కనకాయలంక కాజ్‌వే ఈ ఏడాది నాలుగోసారి నీట మునిగింది. మంగళవారం రాత్రి కాజ్‌వేపై రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహిస్తోంది. దీంతో విద్యార్థులు, కనకాయలంక గ్రామాల ప్రజలు వరదలో రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని ఊడి మూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆ గ్రామాల ప్రజలు రెండు నెలలుగా పడవలపై ప్రయాణిస్తున్నారు. అలాగే జిల్లాకు సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక, అయోధ్యలంక గ్రామాల ప్రజలు కూడా పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు.


వరద ఉధృతిలో కనకాయలంక కాజ్‌వేను దాటుతున్న ప్రజలు

ప్రజా సమస్యలపై గళమెత్తిన ప్రజాప్రతినిధులు

అమలాపురం రూరల్: ప్రజా సమస్యలపై ప్రజా ప్రతినిధులు ధ్వజమెత్తారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చిన్నబాబు తన పరిధిలో ప్రగతి మాట్లాడుతుండగా గ్రామాల్లో జాతీయ జల జీవన్ మిషన్ పథకంలో నిర్మించిన ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణం అసంపూర్తిగా వదిలివేశారని తాండవపల్లి ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు ప్రశ్నించారు. ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారని ట్యాంక్ నిర్మాణాలు ఎప్పుడు పూర్తి చేస్తారని ఏఈని ఎంపీపీ భాగ్యలక్ష్మి ప్రశ్నించారు. ఏఈ సమాధానం ఇస్తూ బిల్లులు మంజూరు కాకపోవడం వల్ల సంబంధిత కాంట్రాక్టర్ల పనులను మధ్యలోనే వదిలేశారని సమాధానం ఇచ్చారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని ప్రజాప్రతినిధులు తీర్మానం చేశారు. రుణాలకు టార్గెట్ పెట్టి వసూలు చేయాలని ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు వీవోఏ, సీసీలను అధికారులు వేధిస్తున్నారంటూ ఏపీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎందుకు వీవోఏలపై జాలి చూపిస్తున్నారు వాళ్ల టార్గెట్‌లు వాళ్లు పూర్తి చేయాలని ఎంపీపీ అన్నారు. పేరూరు ఎంపీటీసీ వాసంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కార్పొరేషన్ రుణాలు సక్రమంగా ఇవ్వడం లేదంటూ ప్రశ్నించారు. బండారులంక ఎంపీటీసీ అంకం హిమ భారతి మాట్లాడుతూ బండారులంక గ్రామంలో నడుస్తున్న కుట్టు మిషన్ శిక్షణకు సంబంధించిన పూర్తి వివరాలు ఇవ్వాలని కోరారు.

ఎంపీటీసీలకు గౌరవం లేదు

గౌరవవేతనం లేదు అంటూ సమావేశంలో ప్లే కార్డులతో ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు వినూత్న రీతిలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఎంపీటీసీలకు గౌరవ వేతనం లేదు, సరైన గౌరవం కూడా లేదంటూ సర్వసభ్య సమావేశంలో ప్ల కార్డులు ప్రదర్శించారు. ఆయన మిగిలిన ఎంపీటీసీలు ఊడుం రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాసరావులుతోపాటు పలువురు మద్దతు పలికారు. ప్రభుత్వం ఉచితంగా రక్త పరీక్షలు చేస్తున్న విషయం తెలియక ఎంతో మంది పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి జేబులు గుల్ల చేసుకుంటున్నారని పేరూరు పీహెచ్‌సీ వైద్యాధికారి దృష్టికి ఎంపీపీ తెచ్చారు. ఆశా కార్యకర్తలు ద్వారా ఉచిత రక్త పరీక్షలపై గ్రామాల్లో ప్రచారం చేయించాలంటూ వైద్య అధికారులకు ఎంపీపీ భాగ్యలక్ష్మి సూచించారు. విద్యుత్ సమస్యలపై ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ ఏఈని ప్రశ్నించారు. ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్ట్ అధికారి రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులందరకూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని వివరించారు. ఈనెల 17వ తేదీ నుంచి పోషణ మహా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మూర్తి, సర్పంచులు రేలంగి దుర్గారావు, చెల్లు బోయిన వెంకటేశ్వరరావు, దాసరి అరుణా డేవిడ్, ఎంపీటీసీలు పరమట నాగమణి, మెండు గంగాభవాని, ఈవోపీఆర్డీ సూరపరాజు, సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, విజయ కుమారి, ఏపీవో శ్రీనుబాబు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.


గౌరవవేతనం లేదు అంటూ సమావేశంలో ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న ఈదరపల్లి ఎంపీటీసీ సత్తిబాబు తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి